క్లుప్తంగా

ఎమ్మెల్యే వాసుపల్లికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యే వాసుపల్లికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న విజయలక్ష్మి తదితరులు

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, సభ్యులు, కన్వీనర్లు బొర్రా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంతం, మంగం పార్వతి, అబ్దుల్ రెహమాన్, వలంటీర్లు లక్ష్మీ టాకీష్ వద్ద మంగళవారం జరిగిన ప్రజాదర్బార్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

కోలా గురువులుకు..



కోలా గురువులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులుకు 33వ వార్డు నాయకులు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, శీరపు ప్రసాద్‌రెడ్డి, మానస తదితరులు మంగళవారం అతని గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి తమ వంతు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. 2024లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీ ఆదాయం రూ.1.22 లక్షలు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో రమాబాయ్, చైర్‌పర్సన్ విజయలక్ష్మి

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి హుండీ ద్వారా రూ.1,22,497 ఆదాయం లభించిందని ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. ఈ మొత్తం రెండు నెలలకు గాను లభించినట్లు చెప్పారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో ఆలయ చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, ధర్మకర్తలు లక్ష్మీకాంతం, చంద్రకళ, శ్రీహరి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బర్దన్ జీవితం ఆదర్శనీయం



బర్దన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం : నేటి యువతరం కమ్యూనిస్టులకు ఏబీ బర్దన్ జీవితం ఆదర్శనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. ఆ పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి, కార్మిక సంఘం నేత ఏబీ బర్దన్ వర్ధంతి సభ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది. ముందుగా బర్దన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ బర్దన్ విద్యార్థి దశలోనే ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ. విమల, జీఎస్‌జే అచ్యుతరావు, సీఎస్ క్షేత్రపాల్, నాయకులు ఎండీ బేగం, బి. పుష్ప, కె. వనజాక్షి, జి. కాసులరెడ్డి, ఎ. దేవుడమ్మ, గాయత్రి, వై.రాంబాబు, ఎం.శ్రీనివాస్, బి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి



గైనిక్ ఓపీ



డ్రగ్ స్టోర్



ప్రగతిపథం

ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రికి మరిన్ని హంగులు

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆరోగ్యశ్రీ వార్డు



విక్టోరియా ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులో చికిత్స పొందుతున్న స్త్రీలు

మహారాణిపేట : ఉత్తరాంధ్రలో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ విక్టోరియా (ఘోష) ఆస్పత్రి ప్రగతి పథంలో పయనిస్తోంది. కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన వివిధ పనులు శరవేగంగా పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారు. దీని కోసం ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎ.నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మథరావు అభివృద్ధి పనులు చేపట్టారు. రూ. 34 లక్షలతో లాజరస్ వార్డులో లిఫ్ట్, మెడికల్ రికార్డుల గది, ల్యాబొరేటరీ, ఆర్‌వో ప్లాంట్ విస్తరణ, ఆరోగ్యశ్రీ రూమ్‌లు నిర్మిస్తున్నారు. రూ. 10 లక్షలతో డ్రగ్ స్టోర్స్, మెటర్నిటీ ఓటీ వంటివి పునర్నిర్మిస్తున్నారు. రూ. 20 లక్షలతో ఆస్పత్రిలో పలు భవనాల మరమ్మతులు చేపట్టారు. రూ. 26 లక్షలతో 250 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్, రూ. 12 లక్షలతో ఎయిర్ కండిషన్లు, రూ. 3 లక్షలతో పబ్లిక్ ఎడ్రస్ సిస్టమ్ పనులు చేపడుతున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉష తెలిపారు. సీఎస్ఆర్ కింద పలు అభివృద్ధి పనులు చేసి, సదుపాయాలు, వైద్య పరికరాలు కల్పించారు. ప్రసూతి ఆస్పత్రి కావడంతో లేబర్ రూమ్ నాణ్యత మెరుగుదలకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో 250 పడకలు ఉన్నాయి. అధికారికంగా 177 పడకలు ఉండాలి. కాని డెలివరీల సంఖ్య పెరగడంతో మరో 73 పడకలు అదనంగా వేశారు. ఇంకా డెలివరీల సంఖ్య పెరిగిపోతుండడంతో మరో 20 పడకల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఆస్పత్రిలో మొత్తం నాలుగు గైనిక్ యూనిట్లు నడుస్తున్నాయి. ప్రతి రోజు ఓపీకి 125 నుంచి 150 మంది వరకు స్త్రీలు, బాలింతలు, గర్భిణులు వస్తుంటారు.

- రూ. **34** లక్షలతో లాజరస్ వార్డులో లిఫ్ట్, మెడికల్ రికార్డుల గది, ల్యాబొరేటరీ, ఆర్‌వో ప్లాంట్ విస్తరణ, ఆరోగ్యశ్రీ రూమ్ నిర్మాణం
- రూ. **10** లక్షలతో డ్రగ్ స్టోర్స్, మెటర్నిటీ ఓటీ నిర్మాణం
- రూ. **20** లక్షలతో పలు భవనాలకు మరమ్మతులు
- రూ. **26** లక్షలతో 250 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం
- రూ. **12** లక్షలతో ఎయిర్ కండిషన్ల ఏర్పాటు
- రూ. **3** లక్షలతో పబ్లిక్ ఎడ్రస్ సిస్టమ్ ఏర్పాటు

అందుబాటులోకి మరిన్ని సేవలు



ఆస్పత్రిలో చేపట్టిన పలు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చాలా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అవన్నీ పూర్తయితే ఆస్పత్రిలో మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి.

– డాక్టర్ పి.ఉష, సూపరింటెండెంట్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి

సౌకర్యాల కల్పనకు కృషి



విక్టోరియా ఆస్పత్రిలో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. రోగుల సౌకర్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఆస్పత్రికి అత్యాధునిక పరికరాలు ఇవ్వడంతో పాటు సౌకర్యాల కల్పనకు కూడా పెద్దపీట వేస్తోంది.

– మన్మథరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

వైద్యుల సహకారంతో సాధారణ డెలివరీ



నేను ఆశిపాప వీధిలో నివసిస్తున్నాను. నాకు ఇటీవల ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో డెలివరీ జరిగి బాబు జన్మించాడు. నేను, బాబు క్షేమంగా ఉన్నాం. ఇక్కడి వైద్యులు చక్కని సేవలందిస్తున్నారు. మందులు కూడా ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– బి.మహిమ, ఆశిపాప వీధి, 36వ వార్డు

ఆస్పత్రి అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..



విక్టోరియా ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. గతంలో ఇదే ఆస్పత్రి పరిస్థితి ఏమీ బాగుండేది కాదు. కాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సదుపాయాలు కల్పించింది. దీంతో ఈ ఆస్పత్రి ప్రగతి పథంలో నడుస్తోంది.

– రెయ్యి రేవతి, ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్

హుషారుగా 'ఆడుదాం ఆంధ్ర'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీహరిరెడ్డి, అయ్యప్పరెడ్డి

అల్లిపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం హుషారుగా సాగుతోంది. మంగళవారం 33వ వార్డు వుడ్‌యార్డ్ స్ట్రీట్ సచివాలయం పరిధిలో గల క్రీడాకారులతో, ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఖోఖో పోటీలు ఉత్సాహం సాగాయి. ఈ పోటీలలో కేకే-1, కేకే-2, కేకే-3 టీంలు తలపడ్డాయి. తొలత టీమ్‌లను వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, ఎస్‌వో పార్వతి పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన పోటీలలో కేకే-3 టీమ్ విజయం సాధించింది. ఎంపైర్లుగా జి.మానస, బి. దేవి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు బి.రేణుక, జె. పార్వతి, ఎండీ నూర్జహాన్, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా సంకీర్తన



గీతాలు ఆలపిస్తున్న భక్త బృందం సభ్యులు

డాబాగార్డెన్స్ : హనుమాన్ చాలీసా సంకీర్తన గానం, రామదాసు కీర్తనల ఆలాపన మంగళవారం జరిగింది. డాబాగార్డెన్స్ పరిధిలో గల శ్రీహరే రామ సంకీర్తన భక్త బృంద కార్యాలయంలో సీతారామ ఆచార్యుల మంగళా శాసనంతో కృష్ణంరాజు, లక్ష్మీ దంపతుల సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సంకీర్తన సేవా సంస్థ హరేరామ సంకీర్తన భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుధా సీతాపతిరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ సంకీర్తనలు, భక్తిగీతాలు ఆలపించారు.

కాల భైరవ హోమం నేడు

సీతంపేట: బహుళ అష్టమి సందర్భంగా బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీ లలితాపీఠంలో కాలభైరవ హోమం జరిపిస్తున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. గురువారం ఉదయం 9.30 గంటలకు చండీహోమం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి



నాదస్వర కచేరీ చేస్తున్న కళాకారులు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 20వ రోజు మంగళవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

అష్టదళ పద్మారాధన..

108 స్వర్ణపుష్పాలతో కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన జరిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాదస్వర కచేరీ..

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నాదస్వర కచేరీ నిర్వహించారు. కళాకారులు పలు కీర్తనలు ఆలపించారు.

6న రథయాత్ర..

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసంలో ప్రతి ఏటా నిర్వహించే కనకమహాలక్ష్మి అమ్మవారి రథోత్సవ కార్యక్రమం ఈ నెల 6న అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్ మీదుగా ఆలయం వరకు రథోత్సవం సాగనుంది.

కాంస్య పతక విజేతకు అభినందనలు



అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్న ఫాదర్ విజయభాస్కర్

కంచరపాలెం : జ్ఞానాపురం సోఫియా జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న బాక్సింగ్ క్రీడాకారుడు ఎ. అశోక్‌కుమార్‌ను కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఫాదర్ శివ్వం విజయభాస్కర్ మంగళవారం అభినందించారు. ఇటీవల మహారాష్ట్ర అకోలాలో జరిగిన జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో బాక్సింగ్ క్రీడాల్లో అండర్-19 విభాగంలో 69-75 కేజీల కేటగిరీలో అశోక్‌కుమార్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఫాదర్ విజయభాస్కర్ మాట్లాడుతూ అశోక్‌కుమార్ పతకం సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) నిర్వహించిందన్నారు. అశోక్‌కుమార్ రానున్న కాలంలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించాలని, మరిన్ని మెడల్స్ సాధించి దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీవీఆర్ శేషుబాబు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, ఔషధ మొక్కలు నాటండి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: పండ్లు, ఔషధ మొక్కలను విరివిగా నాటాలని ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ కోరారు. గ్రీన్‌క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఏయూ సోషల్ వర్క్ విభాగంలో మొక్కలు నాటారు. విద్యార్థులను భాగస్వాములను చేస్తూ విరివిగా మొక్కలను నాటాలని హరనాథ్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులంతా పర్యావరణ పరిరక్షణ దిశగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు చక్కటి స్పందన



బోటు యాజమానులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



నూతన వలంటీర్ శ్రావణికి నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట : మత్స్యకారుల కోసం మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. ముందుగా మత్స్యకార సంఘాల నాయకులు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఎమ్మెల్యేకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విశాఖ కోస్టల్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్రి కొండబాబు రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి ఆవిష్కరించారు. కాగా ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన బోట్లను 11వ నంబర్ జెట్టీ వద్ద స్క్రాప్‌గా వదిలేశారు. వాటిని ఖాళీ చేయాలంటూ ఇప్పటికే నోటీసులు రావడంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన వాసుపల్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూ.152 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ చేయనున్న దృష్ట్యా అభివృద్ధి పనులను పరిశీలించేందుకు 4వ తేదీన కేంద్ర కమిటీ రానున్నట్లు ఫిషింగ్ హార్బర్ జేడీ వాసుపల్లికి తెలిపారు. దీంతో ఆ ప్రాంతాన్ని శుభ్రపరచాలని ఎమ్మెల్యే వాసుపల్లి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ లాల్ మహ్మద్, ఏడీ విజయ, ఎఫ్‌డీవో ఆశాజ్యోతి, మత్స్యకార సంఘాల నాయకులు వీర్రాజు, కొండబాబు, కార్పొరేటర్లు, మండల ప్రెసిడెంట్లు, వార్డు ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో..

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని దొండపర్తి పరదేశమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పలు సమస్యలు పరిష్కరించారు. మరికొన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముగ్గురు కొత్త వలంటీర్లకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ ఆలయం చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి , డైరెక్టర్ ప్రసాద్, మండల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహనతోనే మహిళలకు రక్షణ

ఏయూ క్యాంపస్: రాజ్యాంగం కల్పించిన హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నప్పుడే మహిళలకు రక్షణ సాధ్యపడుతుందని ఏయూ ఆర్ట్స్, కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. మంగళవారం మహారాణిపేట మహిళా అతిథి గృహంలో డాక్టర్ దుర్గాబాయ్ దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం, వుమెన్ గ్రీవెన్స్ సెల్, ఐసీసీ అంతర్గత ఫిర్యాదు కేంద్రం సంయుక్తంగా మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ముందుగా దుర్గాబాయి దేశముఖ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మహిళలకు విద్య ఎంతో అవసరమని, తద్వారా మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి పోరాటాన్ని నడిపించిన దుర్గాబాయి దేశముఖ్ జీవితం నుంచి స్ఫూర్తిని పొందాలన్నారు. మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ 1987లో ప్రారంభించిన ఈ కేంద్రం మహిళల ప్రగతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుంటూ ప్రతిభతో రాణించాలన్నారు. దిశ మహిళా పోలీస్ స్టేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మాధవి గణపతి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు ఎక్కువ సమయం వెచ్చించకుండా చదువుపై దృష్టిసారించాలన్నారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ దిశ చట్టం వల్ల మహిళలకు ఉపయోగాలు, సమస్యలు వచ్చిన సందర్భంలో స్పందించే విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్, ఆర్ట్స్ కళాశాలలకు చెందిన పీజీ విద్యార్థులు 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి




జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మహిళా చేతన సభ్యులు

సీతమ్మధార : విశాఖలో జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహిళా చేతన ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కె.పద్మ మాట్లాడుతూ ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో నిందితులను శిక్షించాలని, అత్యాచార సమయంలో పోలీసులు బాలిక ఫోన్ ట్రాక్ చేసి ఉంటే నేర తీవ్రత తగ్గి ఉండేదని అన్నారు. మధురవాడలో ఒక మైనర్ బాలిక అత్యాచారం వెలుగులోకి వచ్చిందని అన్నారు. విశాఖలో అత్యాచార సంస్కృతి బాగా పెరిగిందన్నారు. ముద్దాయిలపై చార్జిషీట్ వేసి శిక్ష పడేలా ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బీచ్ రోడ్డులో బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా పెట్రోలింగ్ జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

సభ్యుల సంక్షేమానికి కృషి

సీతంపేట: విశాఖ పోర్టు ట్రస్టు మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం వార్షిక సమావేశం మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సమావేశంలో సంఘం అధ్యక్షుడు ఎ.ఎం.ఫ్రెడ్డీ మాట్లాడుతూ సంఘంలో 110 మంది వరకు సభ్యులు సభ్యత్వం కలిగి ఉన్నారని, కొత్తగా మరికొంత మంది చేరారన్నారు. సభ్యుల సంక్షేమం కోసం ఒకరికొకరు సాయం చేసుకోవాలన్నారు. 2023-24 సంవత్సరంలో సంఘం చేపట్టిన సభ్యుల సంక్షేమ కార్యక్రమాలు, గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌లో సభ్యుల సేవల కోసం ఏర్పాట్లు, కొత్త సభ్యుల చేరికలు వివరించారు. 2024 సంవత్సరంలో చేపట్టనున్న కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.ఎన్.ఆర్.గుప్తా, కోశాధికారి డి.వెంకటేశ్వరరావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.